క్లుప్తంగా

శిథిలావస్థలో తరగతి గదులు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): మండలంలోని నాగులపల్లి ప్రభుత్వ పాఠశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. దీంతో గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు సోమవారం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా పాఠశాలలోని చదువుకుంటున్న 47 మంది విద్యార్థులకు కనీస టాయిలెట్ సౌకర్యం కూడా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ పాఠశాల పరిస్థితిపై నివేదికను అందజేయాలని డీఈఓను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శివనంద్ గౌడ్, పద్మారావ్, రాజు, నాగేశ్, షఫీ, ప్రతాప్‌గౌడ్, మల్లేశం, ప్రసన్నకుమార్, దుర్గరాజ్ పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు స్నిగ్ధకు సన్మానం



స్నిగ్ధను సన్మానించిన మీనాక్షి తదితరులు

మునిపల్లి(అందోల్): మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన స్నిగ్ధకు మాజీ జెడ్పీటీసీ మీనాక్షి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మీనాక్షి మాట్లాడుతూ.. మధ్య తరగతి కుటుంబంలో జన్మించి ఉన్నత ఉద్యోగం పొందడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నతమైన పదవులు పొందాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాయికుమార్, ఉపాధ్యాయ సంఘం నాయకులు సిగింతం గొల్ల కిష్టయ్య దంపతులు, పెద్దలోడి శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు.

ఊరూరా గంగమ్మ పూజలు



గంగమ్మకు పూజలు చేసి వదలిన తెప్ప

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజలు సోమవారం గంగమ్మ తల్లికి పూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం శ్రావణ మాసంలో ఈ ప్రాంత ప్రజలు గంగమ్మకు పూజలు చేసి మొక్కులు తీర్చుకుని చల్లంగా చూడాలని వేడుకుంటారు. ఈ సందర్భంగా ప్రజలు గ్రామాల సమీపంలోని చెరువు, వాగుల వద్దకు వెళ్లి తెప్పలో నైవేద్యం పెట్టి పూజలు చేశారు. అనంతరం తెప్పలను నీటిలో వదిలిపెట్టారు.

వర్షం మాటున వ్యర్థ జలాలు విడుదల



బొల్లారం ఆసానికుంటలో నుండి ప్రవహిస్తున్న వ్యర్థ జలాలు

జిన్నారం (పటాన్‌చెరు): పారిశ్రామికవాడలో చినుకు పడితే చాలు వరద నీటితో కలిపి వ్యర్థ జలాలను విడుదల చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బొంతపల్లి, గడ్డపోతారం, బొల్లారం పారిశ్రామిక వాడలోని రసాయన పరిశ్రమలు ఉన్నాయి. వ్యర్థ జలాలతో చెరువులు కుంటలు నిండుకుండల్లా మారాయి. గతేడాది వ్యర్థ జలాలు సేవించి పదుల సంఖ్యలో మూగజీవులు మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. పీసీబీ అధికారులు చర్యలు చేపట్టి రసాయన జలాల విడుదలను అరికట్టాలను కోరుతున్నారు.

కొత్త రేషన్ కార్డుల పంపిణీ



కార్డులు పంపిణీ చేస్తున్న ఆర్‌ఐ సిద్ధారెడ్డి

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని గొటిగార్‌పల్లిలో సోమవారం కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గ్రామానికి 21 కొత్త రేషన్ కార్డులు మంజూరు కాగా 61 మంది పేర్లను చేర్చారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సిద్దారెడ్డి పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు కొత్త కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సురేఖ, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మీ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సిద్దయ్య, బిచ్చప్ప, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు విఠల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నస్తీపూర్‌కు హరిత హారం

- పదివేల మొక్కల సంరక్షణ
- ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలుకు అభినందనలు



రోడ్డుకు ఇరువైపులా స్వాగతం పలుకుతున్న చెట్లు

హత్నూర(సంగారెడ్డి): మొక్కల సంరక్షణే ఆయన ధ్యేయం.. అధికారుల ఆదేశమే శిరోధార్యం.. అదో ఓ చిన్న గ్రామం. అయినా.. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ గ్రామంలో సుమారు పది వేల మొక్కలను సంరక్షించి జిల్లాకే ఆదర్శంగా నిలిచారు. ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు. హత్నూర మండలం నస్తీపూర్‌లో హరితహారం కింద 2018 నుంచి 2024 వరకు వివిధ రకాల మొక్కలు నాటారు. సుమారు పది వేల మొక్కలు నాటగా, 9,900 మొక్కలను సంరక్షించి అధికారుల మన్ననలు పొందారు. బ్రోత్తరపల్లె ప్రగతివనంలో 7,000 మొక్కలను నాటగా 6,500 మొక్కలు మహా వృక్షాలుగా ఎదిగి ప్రస్తుతం చిట్టడవిని తలపిస్తున్నాయి. పల్లె ప్రకృతి వనంలో వెయ్యి మొక్కలు నాటగా, 960 మహా వృక్షాలు ఎదిగాయి. సంగారెడ్డి దౌల్తాబాద్ ప్రధాన రహదారి నుంచి నస్తీపూర్ వరకు రోడ్డుకు ఇరువైపులా 400 మొక్కలు నాటారు. ప్రస్తుతం 380 మొక్కలు పచ్చదనంతో గ్రామానికి వచ్చే ప్రయాణికులకు స్వాగతం పలుకుతున్నాయి. గ్రామ శివారులోని ఎస్సీ, బీసీ హాస్టల్ ఆవరణలో గత కలెక్టర్ రోనాల్డ్‌రాస్ 500 మొక్కలు నాటించగా, 460 మొక్కలు చెట్లుగా పెరిగి విద్యార్థులకు పచ్చదనంతో పాటు మంచి వాతావరణాన్ని అందిస్తున్నాయి. ఉద్యోగం అనేది సామాజిక బాధ్యత అని మొక్కల సంరక్షణ తమ లక్ష్యమంటూ ముందుకు సాగుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలును ఉన్నతాధికారులు అభినందించారు.

> **సంతోషంగా ఉంది..**
>
> 
>
> హరితహారంలో నాటిన మొక్కల సంరక్షించి గ్రామంలో పచ్చదనం నెలకొనడం సంతోషంగా ఉంది. పదివేల మొక్కలను గ్రామంలో సంరక్షించం. అందరి సహకారం వల్లే సాధ్యమైంది.. ఉన్నతాధికారులు సైతం తనను అభినందించడం సంతోషంగా ఉందన్నారు.
>
> –సాయిలు ఫీల్డ్ అసిస్టెంట్ నస్తీపూర్

గణనాథుడికి ఎమ్మెల్యే పూజలు



ఆలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని సోమవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని గణేష్ గడ్డ సిద్ధి వినాయక దేవాలయాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ మాజీ ధర్మకర్తలు, ఈఓ లావణ్య, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్‌లతో సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమానికి గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, రుద్రారం పీఏసీఎస్ చైర్మన్ పాండు, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నరసింహ రెడ్డి, వెంకన్న, రాజు, హరిప్రసాద్ రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, గ్రామ పుర ప్రముఖులు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సౌజన్య

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి టౌన్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. ప్రపంచ ఆదివాస అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని గిరిజన లా కాలేజీలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదివాసుల సంస్కృతి, వారసత్వం హక్కులను గుర్తించుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో వారి అనుభవం మనకందరికీ ఎంతో ఉపయోగకరమన్నారు. అనంతరం లా కళాశాల విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, విద్యార్థులు ఉన్నారు.

క్యూబా ప్రజలకు అండగా నిలబడుద్దాం..

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య



సంఘీభావం నిధిని రాజయ్యకు అందజేస్తున్న కార్మికులు

పటాన్‌చెరు టౌన్: క్యూబా ప్రజలకు మనమంతా అండగా నిలబడాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య పిలుపునిచ్చారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తోషిబా పరిశ్రమలోని కార్మికులు క్యూబా ప్రజలకు సంఘీభావం నిధిని రాజయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యూబా ప్రజలకు తాము అండగా ఉండాలని కోరారు. క్యూబా ప్రజలను అమెరికా సామ్రాజ్యవాద విధానాల వల్ల ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక షరతులు విధిస్తున్నదని విమర్శించారు. అమెరికా గత 40 సంవత్సరాల నుంచి క్యూబా దేశాన్ని వేధింపులకు గురి చేస్తున్నప్పటికీ క్యూబా ప్రజలు అమెరికాకు లొంగలేదని గుర్తు చేశారు. అమెరికా మందులు, ఆహారం, చిన్నపిల్లలకు కావాల్సిన వస్తువులు సైతం రాకుండా అడ్డుకుంటుందని మండిపడ్డారు. సీఐటీయూ అఖిల భారత కమిటీ పిలుపు మేరకు సంఘీభావం నిధిని అన్ని చోట్ల విస్తృతంగా వసూలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ అనంతరావు, నాయకులు శ్రీధర్, ప్రకాష్ , బంగారాజు, కృష్ణయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: అధికంగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాల వల్ల కరెంట్‌షాక్‌కు గురయ్యే అవకాశం ఉంటుందని, ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ఎలాంటి విపత్తులు ఎదురైనా వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. నీటిలో ఉండే వంతెనలు, కట్టలు దాటవద్దని, జలపాతాలు, వాగులు, చెరువులు దాటవద్దని సూచించారు. బట్టలు ఆరవేసే ఇనుప వైర్లను తాకవద్దని, పురాతన భవనాలకు దగ్గరగా ఉండవద్దని చెప్పారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలి

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు అరవింద్

వట్‌పల్లి(అందోల్): మండలంలోని పోతులబోడుగా మోడల్ పాఠశాల, కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రిన్సిపాల్ డీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా ఇంటర్ పరీక్ష కేంద్రం లేకపోవడంతో మండలానికి చెందిన విద్యార్థులు హత్నూర కళాశాల పరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్షలు రాయాల్సి వస్తుందన్నారు. 50 కిలోమీటర్ల దూరంగా ఉన్న పరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్ష రాయడంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని స్థానికంగా ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు.

రోడ్డును బాగు చేయాలని వినతి

జహీరాబాద్: కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్ గ్రామానికి చెందిన యువకులు తమ గ్రామ రోడ్డు అధ్వాన పరిస్థితిని సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వివరించారు. గ్రామం నుంచి కోహీర్‌కు వెళ్లాలన్నా వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో రాకపోకలు సాగించాలన్నా నానాఅవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాగైనా రోడ్డును నిర్మించాల్సిందిగా చూడాలని విన్నవించారు. కలెక్టర్ స్పందిస్తూ ఆయాశాఖల అధికారులను రోడ్డు నిర్మాణం విషయమై పరిశీలించాలని ఆదేశాలు జారీ చేసినట్లు గ్రామ యువకులు పేర్కొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

తహసీల్దార్ రవికుమార్



డబ్బాలను తొలగిస్తున్న అధికారులు

కంది(సంగారెడ్డి): ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవికుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని చేర్యాల శివారులోని ప్రభుత్వ భూమిలో కొందరు రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపట్టారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ పోలీసుల సహకారంతో అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. చేర్యాలకు చెందిన సర్వే నంబర్లు 448, 449, 450, 451 సీలింగ్ పట్టాకు చెందిన భూముల్లో కొందరు అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించారు. ప్రభుత్వ భూములను కబ్జా నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అసెస్మెంట్లను త్వరగా పూర్తి చేయండి

మున్సిపల్ కమిషనర్ కిషన్



కొలతలు సేకరిస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. సోమవారం మున్సిపల్ అధికారుల బృందం ఆస్తిపన్ను రివిజన్ కానీ 696 అసెస్మెంట్ల వివరాలను సేకరించి ఆయా వార్డు ఆఫీసర్లకు కేటాయించారు. అనంతరం భువన్ సర్వే బృందం యాప్‌లో నమోదు చేస్తున్న ఆస్తిపన్ను వివరాలు నేటికి 696 గాను 476 రివిజన్ చేసినట్లు మేనేజర్ మల్లికార్జున స్వామి వెల్లడించారు. మిగిలిన 220 అసెస్మెంట్లను వందరోజుల ప్రణాళిక కార్యక్రమంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ కిషన్ పేర్కొన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పది పాయింట్ రూ.55 కోట్ల ఆస్తిపన్ను డిమాండ్ ఉందని 2024–25 ఆర్థిక సంవత్సరానికి 11.59 కోట్ల ఆస్తిపన్ను డిమాండ్ పెంచామన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరం నేటికీ సంబంధించి 12.5 కోట్ల వరకు ఆస్తిపన్ను డిమాండ్ పెంచామని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, స్థానికులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు నిర్వహణ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో పారిశుద్ధ్య పనులు కచ్చితంగా నిర్వహించాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం గ్రేటర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలు, 16న జరగబోయే శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల సందర్భంగా డివిజన్ పరిధిలోని ఆలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీసీ సురేష్ , ఏఎంఓహెచ్ డాక్టర్ విజయ్, శానిటరీ సూపర్‌వైజర్ పవన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతుబీమా నమోదు చేసుకోండి



రైతు బీమా దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ శంకర్

నారాయణఖేడ్: భూభారతి పోర్టల్‌లో గత జూన్ 5 నాటికి డిజిటలైజేషన్ చేసిన పట్టాదారుల వివరాలు, పాత, కొత్త అర్హులైన రైతులు బీమా పునరుద్ధరణ, నమోదు జరుగుతోందని నాగల్‌గిద్ద, ఖేడ్ ఏఓలు ప్రవీణ్‌చారి, శంకర్ తెలిపారు. సోమవారం రైతు బీమాకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీమా నమోదుకు బుధవారం చివరి రోజు అని తెలిపారు. 1966 ఆగస్టు 8 నుంచి 2007 ఆగస్టు 14 మధ్య పుట్టిన 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు గల రైతులు రైతు బీమాకు అర్హులని తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, పట్టా పాసుపుస్తకం, నామినీ ఆధార్‌కార్డు, బీమా ఎన్‌రోల్‌మెంట్ ఫామ్‌తో రైతు సంతకం చేయాల్సి ఉన్నందున రైతువిధిగా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల వద్దకు వచ్చి నమోదు చేయించుకోవాలని సూచించారు.

కేతకీలో మార్మోగిన శివనామస్మరణ



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ప్రసిద్ధ శైవ క్షేత్రం కేతకీ సంగమేశ్వర ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. శ్రావణమాసం సోమవారం శివుడికి ఇష్టమైన రోజు కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు ప్రాతఃకాల సమయంలో ప్రత్యేక పూజలు చేసి దర్శన సౌకర్యం కల్పించారు. భక్తులు ఆలయ ఆవరణలోని అమృతగుండంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి, గుండంలోని జల లింగానికి పూజలు చేశారు. మహారాష్ట్రలోని సోలాపూర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఓం శంకర్ పాటిల్ పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి సన్మానించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈఓ శివరుద్రప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, పాలక మండలి చైర్మన్ చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు ఎంపిక

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రం వట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రంజిత్ తెలిపారు. ఈనెల 2న జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు పాల్గొనగా మెగావత్ అనిత(10వ తరగతి), డి. ముస్కాన్(8వ తరగతి) ప్రతిభ కనబరచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు.

సంక్షిప్త వార్తలు

◆ **మందుబాబులకు జరిమానా**

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు జరిమాన విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి పట్టణంలోని పాత బస్టాండ్, పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 14మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. సోమ వారం వారిని జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ పేర్కొన్నారు.

పటాన్ చెరు పట్టణంలో..

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచి జరిమానా విధించారు.

◆ **నష్టపరిహారం ఇవ్వండి**

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, జంగంపేట భూబాధితులకు న్యాయం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రైతులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గత బీఆర్‌ఎస్ హయాంలో హెచ్ఎండీఏ పరిశ్రమల ఏర్పాటుకు 2023లో రైతుల అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుంది. నష్ట పరిహారంగా ఎకరాకు 600 గజాల పట్టాను అందజేసింది. కానీ పొజిషన్ మాత్రం చూపలేదు. రైతుల నుంచి స్వాధీనం చేసుకున్న భూముల్లో ప్రస్తుతం పరిశ్రమల నిర్మాణం సాగుతోంది.

◆ **ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి**

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. భాస్కర్ అన్నారు. తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

◆ **15న ఉచిత వైద్య శిబిరం**

సదాశివపేట(సంగారెడ్డి): స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎడ్ల బజార్ బసవేశ్వర మందిరంలో శ్రీఅద్య మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులచే ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని ప్రజలు సద్వినియోగించుకోవాలని చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింత రాజు తెలిపారు.

◆ **ఉప తహసీల్దార్‌కు వినతి**

మునిపల్లి(అందోల్): మండలంలోని బుదేరా శివారులోని సర్వే నంబర్ 30లోని ప్రభుత్వ భూమిని ఝరాసంగం మండలం అనందగిరి మాత, చైతగిరిలకు అప్పగించొద్దని సీపీఎం మండల నాయ కులు రమేశ్‌గౌడ్ ఉపతహసీల్దార్ ప్రదీప్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనందగిరికి రెండు ఎకరాలు, చైతగిరికి రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఎలా అప్పగించారో వివరణ ఇవ్వాలని వినతిలో కోరారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

ఎమ్మెల్యే మాణిక్‌రావు



జహీరాబాద్ టౌన్: విద్యార్థినికి మాత్రలు తినిపిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



జిన్నారం: విద్యార్థులకు మాత్రలను వేస్తున్న ఎంఈఓ

జహీరాబాద్ టౌన్: నులి పురుగుల నివారణతో చిన్నారుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. అయన మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత లోపం, కలుషితమైన ఆహారం, ఫాస్ట్‌ఫుడ్ తీసుకోవడం వల్ల చిన్నారుల్లో ఇన్ఫెక్షన్ ఏర్పడుతుందన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రిదేవి నులిపురుగులు, నివారణ గురించి వివరించారు.

విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాల్‌కల్, మిర్జాపూర్(బి) పీహెచ్‌సీల్లో ఎంపీడీఓ శ్రీనివాస్, వైద్యులు అమృత్ రాజ్, హర్షవర్ధన్‌రెడ్డి మాత్రల పంపిణీ చేశారు.

గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఫైలేరియా, నులిపురుగుల మాత్రలను పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి మధుకర్ పేర్కొన్నారు. సోమవారం వివిధ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, చేతులు శుభ్రం చేసుకోవడంపై అవగాహన కల్పించారు.

నిజాంపేట్ మండల కేంద్రంలో..

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రంలోని పాఠశాలల్లో చిన్నారులకు నులిపురుగల నివారణకు అల్బెండజోల్ ట్యాబ్లెట్ల పంపిణీని సోమవారం ఎంపీడీఓ సంగ్రాం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్య సిబ్బంది విద్యార్థులకు ట్యాబ్లెట్లు అందజేశారు .

నిజాంపూర్ కాలనీలో..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): నులి పురుగులను పూర్తిగా నిర్మూలించి, రక్త హీనతను తగ్గించేందుకే ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు హెచ్ఎం రామకృష్ణ తెలిపారు. మండలంలోని నిజాంపూర్ కాలనీ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

రామచంద్రాపురం పట్టణంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం రామచంద్రాపురం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత మందుల పంపిణీ చేశారు.